క్లుప్తంగా

ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని జెండాలు పాతిన పేదలు



కుమ్మరవాండ్లపల్లిలో ఇంటిస్థలాల కోసం జెండాలు పాతుతున్న పేదలు

కదిరి అర్బన్: కూటమి ప్రభుత్వం ఏడాదైనా ఇంటి స్థలాలు ఇవ్వనందుకు నిరసనగా పేదలు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కుమ్మరవాండ్లపల్లిలో సర్వేనంబర్ 720లో జెండాలు పాతారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేదలకు మూడు సెంట్లు, పట్టణ పేదలకు రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం హామీని అమలు చేయలేదన్నారు. హామీ అమలు కోసం మూడు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం, సచివాలయం, కలెక్టరేట్ వద్ద ఆందోళనలు నిర్వహించినా ఫలితం లేక పోయిందన్నారు. పేదలు ఇచ్చిన అర్జీలపై రెవెన్యూ అధికారులు విచారణ కూడా చేయలేదన్నారు. అందుకే పేదలు ఓపిక నశించి ఇళ్ల స్థలాల కోసం జెండాలు పాతారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జీఎల్ నరసింహులు, సాంబశివ, శాంతా బాయి, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు భూములు గుర్తించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి డివిజన్‌లోని ఆరు మండలాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ భూములు గుర్తించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, ఆర్డీఓ సువర్ణ ఆదేశించారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆయా మండలాల తహసీల్దార్లు, డీటీలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో శ్మశాన వాటికలకు, పరిశ్రమలకు అనుకూలంగా ఉన్న భూములను వెంటనే గుర్తించాలన్నారు. రెవెన్యూ సమస్యలపై ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోరాదన్నారు. అందరూ కలసికట్టుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు కళ్యాణ్, అనంతఆచారి, రామనాథరెడ్డి, రంగనాయకులు, షాబుద్దీన్, రామాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారాలను అరికట్టాలి

కనగానపల్లి: రాష్ట్రంలో దళిత, గిరిజన బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను ప్రభుత్వం అరికట్టాలని ఎన్‌టీఎఫ్ (నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్) రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగు రోజుల వ్యవధిలోనే ఇద్దరు బాలికలపై అత్యాచార సంఘటనలు జరగడం దారుణమన్నారు. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో బాలికపై సామూహిక అత్యాచారం, అనంతపురం సమీపంలో కూడేరు వద్ద గిరిజన బాలికను హత్య చేసినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మండల గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ఎస్టీయూ ధ్యేయం



ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

గాండ్లపెంట: ఎన్‌పీకుంట ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ఎస్టీయూ 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా ఎస్టీయూ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు గోపాల్ నాయక్, సుబ్బిరెడ్డి, జిల్లా అధ్యక్షులు పర్వతరెడ్డి, వెంటేశ్వర్లు, రవీంద్రారెడ్డి, రెడ్డెప్ప, సుదర్శన్, రామమోహన్, శ్రీవాణి పాల్గొన్నారు.

నేడు మంత్రి సత్యకుమార్ రాక

తాడిమర్రి: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం తాడిమర్రిలో పర్యటించనున్నట్లు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభిస్తారన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన పబ్లిక్ హెల్త్ యూనిట్ బ్లాక్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కమ్మేసిన కంపచెట్లు



మలుపు వద్ద ఏపుగా పెరిగిన కంపచెట్లు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెల గ్రామానికి వెళ్లే దారిలో చెరువుకట్ట కింద దాదాపు కిలోమీటరు పొడవునా రహదారికి ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. కంపచెట్ల కొమ్మలు రోడ్డుపైకి రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఈ మార్గంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక పోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. మలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయలేదని వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

న్యాయమైన పరిహారం ఇవ్వాలి



రోడ్డు పనులను అడ్డుకుంటున్న రైతులు

ముదిగుబ్బ: జాతీయ రహదారి-342 విస్తరణలో భాగంగా ముదిగుబ్బలో భూములు కోల్పోయిన రైతులు తమకు న్యాయమైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిహారం పెంపుదల కోసం వారు చేపట్టిన ఆందోళన 15వ రోజు సోమవారం కొనసాగింది. రైతులు మాట్లాడుతూ మార్కెట్లో ఎకరం రూ.1.20 కోట్లు పలుకుతుంటే.. ప్రభుత్వం రూ.8.90 లక్షల చొప్పున పరిహారం ఇస్తోందన్నారు. తమకు పరిహారం పెంచి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతులు సోమల ప్రకాష్ నాయుడు, హనుమంతు, ప్రభాకర్ నాయుడు, విశ్వనాథ్, సనత్‌కుమార్, మునికుమార్, రఘుశాస్త్రి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం.. తీస్తుంది ప్రాణం



జగనన్న కాలనీలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలోని జగనన్న కాలనీలో ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా తయారైంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నివాస గృహాలకు దగ్గరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పరామర్శ



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని బసంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సాకే పెద్దన్న ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను భార్య లక్ష్మీదేవి, కుమారుడు రామాంజనేయులును అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని.. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సానే రాజారెడ్డి, కన్వీనర్ జోలా రామచంద్రారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలోని వలసల గంగమ్మ దేవస్థానంలో అన్నదాన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ.70 విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని తన తండ్రి మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ చేతుల మీదుగా ఆలయ కమిటీ నిర్వాహకులకు సోమవారం అందజేశారు. దేవాలయంలో నిర్వహించే గజ్జలపూజ, చెక్కభజన కార్యక్రమానికి హాజరయ్యే భక్తులకు అన్నదానం కోసం ఈ విరాళం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ మండల కన్వీనర్ మణికంఠ నాయక్, కాంట్రాక్టర్ బాబా, జాకీర్, బాబు, అంజి, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

విత్తనం ఎంపికలో తస్మాత్ జాగ్రత్త

- నాసిరకం విత్తనాలతో పంటకు ముప్పు
- పెట్టుబడులూ తిరిగిరాక రైతులకు తీవ్ర నష్టం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వ్యవసాయాధికారులు



బత్తలపల్లి ఎస్సీ కాలనీలో వేరుశనగను సిద్ధం చేస్తున్న మహిళలు (ఫైల్)

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. తొలకరి వర్షాలు ప్రారంభమయ్యాయి. పదును వర్షాలు పడిన చోట రైతులు పొలాలకు ఎరువులు తోలడం, దుక్కులు దున్నడం చేపట్టారు. రుతుపవనాలు వచ్చే సమయం ఆసన్నమైంది. వాతావరణం పూర్తి స్థాయిలో అనుకూలిస్తే మరో 20 రోజుల్లో రైతులు విత్తు మొదలుపెట్టనున్నారు. అయితే విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించకపోతే పంట నష్టపోయే ప్రమాదముంది. తమ సూచనలు, సలహాలు తీసుకుని విత్తనాలు ఎంపిక చేసుకుంటే మంచిదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో 65 వేల హెక్టార్ల భూమి ఉంది. ఇందులో 30వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగవుతాయి. ఇందులో ప్రధానంగా వేరుశనగ సాగు చేస్తారు. నియోజకవర్గానికి ప్రభుత్వం సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను 10,822 క్వింటాళ్లు కేటాయించింది. ఎకరా సాగుకు 120 కిలోల విత్తనం అవసరమవుతుంది. అయితే ఎకరం పైబడి ఎంత భూమి ఉన్నా 30 కిలోల పరిమాణంతో కూడిన విత్తన వేరుశనగ బస్తాలు మూడు అందజేస్తుంది. అంటే 90 కిలోలు విత్తనకాయలు ఎకరం లోపు మాత్రమే సాగుచేసుకోవచ్చు. మిగతా విత్తనం కోసం ధర్మవరం, నార్పల, అనంతపురం తదితర ప్రాంతాల్లోని ఫర్టిలైజర్స్ షాపుల నుంచి, రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాల్సి వస్తుంది. రైతుల వద్ద అయితే నాణ్యతను పరిశీలించి తీసుకోవచ్చు. అయితే ఫర్టిలైజర్ షాపుల నుంచి కొనుగోలు చేసే వాటి పట్ల జాగ్రత్త వహించకపోతే రైతులు మోసపోయే అవకాశం ఉంది. తక్కువ ధరకే ఎక్కువ దిగుబడి ఇచ్చే విత్తనం అంటూ నాసిరకం అంటగట్టడానికి ఆఫర్లు పెడితే అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

నాణ్యత లేకుంటే ఫిర్యాదు చేయండి



విత్తన నాణ్యత ప్రమాణాలకన్నా తక్కువ మొలక శాతం నుంచి దిగుబడి ప్రభావితం చేసినట్లు భావిస్తే ఆ సీడ్ కంపెనీపై మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేయవచ్చు. విత్తనం కొనుగోలు చేసిన బిల్లులు భద్రపరుచుకోవాలి. మోసపోయిన రైతులు నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై ఫిర్యాదు చేయవచ్చు.

– ఓబిరెడ్డి, మండల వ్యవసాయాధికారి, బత్తలపల్లి

పెట్టుబడి సాయం అందజేయాలి



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కనగానపల్లి తహసీల్దార్



చెన్నేకొత్తపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

చెన్నేకొత్తపల్లి: రైతులకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెట్టుబడి సాయం అందజేయాలని ఐకాస్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ సురేషకుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలన్నారు. 90 శాతం సబ్సిడీతో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేయాలని డిమాండ్ చేశారు. ఏటా సాగు ఖర్చులు పెరుగుతున్నందున స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రూ.5 లక్షల వరకు పంట రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బాలరాజు, ఆదినారాయణ, మల్లికార్జున, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రైతులకు తక్షణమే అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు అందజేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ, మండల రైతు సంఘం నాయకులతో కలసి రైతు సమస్యలు పరిష్కరించాలంటూ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, రైతు సంఘం నాయకులు ఆదినారాయణ, గోవిందు, ముత్యాలప్ప, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సాగు ఒకరిది.. హక్కు మరొకరికి!



తహసీల్దార్‌కు విన్నవించుకుంటున్న రైతులు

నల్లమాడ: సాగు చేసుకుంటున్న వారి పేర్లు కాకుండా ఇతరుల పేర్లను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కాయలవాండ్లపల్లిలో కావలి కుటుంబానికి చెందిన 23 మంది రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తమ గోడు వెల్లబోసుకున్నారు. తమ తాతముత్తాల నుంచి సంక్రమించిన భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, అయితే రెవెన్యూ రికార్డుల్లో ఆ భూములు ఇతరుల పేర్లపై నమోదై ఉన్నట్లు రీ సర్వే సమయంలో తెలిసిందన్నారు. ఆ పేర్లను తొలగించి.. సాగు హక్కుదారులైన తమ పేర్లను ఆన్‌లైన్‌లో చేర్చాలని తహీల్దార్ రంగనాయకులుకు వినతిపత్రం అందజేశారు. తమ భూములు ఇతరుల పేర్లపై ఉన్నట్లు రీ సర్వే సమయంలో తెలిసిందన్నారు. కార్యక్రమంలో కె.చంద్రశేఖర్, సుధాకర, రామాంజులు, లక్ష్మీనరసప్ప, సుబ్బన్న, లక్ష్మీపతి, నారాయణప్ప, శాంతయ్య, మల్లయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

పుట్టపర్తి టౌన్: మున్సిపల్ కార్యాలయ ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కమినర్ క్రాంతికుమార్‌ను కోరారు. సోమవారం కమిషనర్‌ను చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మికులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఇంజినీరింగ్ వర్కర్లుగా పనిచేస్తున్నా సరైన వేతనాలు ఇవ్వడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, జీతం రూ.26 వేలకు పెంచాలని, విధి నిర్వహణలో రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. లేనిపక్షంలో సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు.

ఉపాధి కూలీ మృతి



మృతుడు కదిరయ్య

తలుపుల : ఉపాధి పని చేస్తున్న కూలీ గుండెపోటుకు గురై మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బట్రేపల్లికి చెందిన కూలీ కె.కదిరయ్య (57) సోమవారం గ్రామ సమీపంలో ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. పని చేస్తున్న సమయంలో ఛాతీలో నొప్పి రావడంతో కుప్పకూలాడు. తోటి కూలీలు వెంటనే 108 అంబులెన్స్‌లో కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి కాసేపటికే కదిరయ్య మృతి చెందాడు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

కూలీ కుటుంబాన్ని ఆదుకోవాలి

కదిరి టౌన్: ఉపాధి హామీ పని చేస్తూ మృతి చెందిన తలుపుల మండలం బట్రేపల్లికి చెందిన కూలీ కదిరయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం కూలీ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కూలీ కుటుంబానికి బీమా కింద తక్షణమే రూ.5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్‌ఎస్‌కేకు చేరిన విత్తన వేరుశనగ

ముదిగుబ్బ: సానేవారిపల్లి రైతు సేవ కేంద్రాని(ఆర్‌ఎస్‌కే)కి సోమవారం విత్తన వేరుశనగ కాయలు సరఫరా అయినట్లు సిబ్బంది తెలిపారు. ఇది వరకు వేరుశనగ కాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు వీటిని పంపిణీ చేయనున్నామన్నారు

చీటీ డబ్బులు చెల్లించలేదని ఫిర్యాదు

తనకల్లు: చీటీ డబ్బులు రూ.4.80 లక్షలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నాడని తిరుమలయ్యగారిపల్లికి చెందిన హరినాథ్‌రెడ్డిపై తిరుపతికి చెందిన ప్రసాద్‌నాయుడు, స్వప్న దంపతులు సోమవారం తనకల్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చీటీ ఎత్తుకుని.. తర్వాతి నుంచి కంతులు సక్రమంగా చెల్లించకుండా మొండికేశాడని అందులో ఆరోపించారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోండి



కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: అనంతపురానికి చెందిన గిరిజన విద్యార్థినిని హత్య చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పీఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కదిరిలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించండి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: గొడవలకు జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. సోమవారం గొట్లూరులో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జూదం, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా మహిళల పట్ల గౌరవంగా ప్రవర్తించాలన్నారు. సైబర్ నేరాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రతల గురించి వివరించారు. అంతకుముందు పోతుకుంట సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



కదిరిలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, పోలీసులు, విద్యార్థులు తదితరులు

కదిరి అర్బన్: ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని అధికారులు సూచించారు. కదిరిలోని జెడ్పీ హైస్కూల్‌లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. యోగాతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. యోగాసనాలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక అనదం కలుగుతుందన్నారు. అనంతరం వేమారెడ్డికూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్పతో పాటు పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

తనకల్లు: యోగాతో ఆరోగ్యకరమైన జీవితం పొందవచ్చని తహసీల్దార్ శోభా సువర్ణమ్మ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాసనాలను నేర్చుకోవాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, వైద్య సిబ్బంది ర్యాలీగా వెళ్లి జాతీయ రహదారిపై మావనహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి లోకేశ్వర్‌రెడ్డి, ఈఓఆర్డీ రాజశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవమ్మ, జయమ్మ, కార్యదర్శి కృష్ణమూర్తిరెడ్డి, పలువురు వీఆర్వోలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీఓ నరసింహనాయుడు పేర్కొన్నారు. యోగాంధ్రలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ యోగా వలన కలిగే ప్రయోజనాలను, ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఉప మండల పరిషత్తు అభివృద్ధి అధికారి క్రిష్టప్ప, కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, పంచాయతీ కార్మికులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు జక్కంపూటి నాగభూషణ, అయ్యప్ప, రమణ, మదనాపు కొండన్న, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో సోమవారం అన్ని శాఖల అధికారులు కలసి యోగాంధ్రపై అవగాహన ర్యాలీ చేపట్టారు. బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలక్రిష్ణుడు, తహసీల్దార్ సురేష్‌కుమార్, మండలవైద్యాధికారి రవినాయక్, ఏఓ ఉదయ్‌కుమార్, ఈఓఆర్డీ అశోక్ నాయక్, ఎస్ఎస్ గేట్ ఆస్పత్రి సిబ్బంది, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు: తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథ గుప్తా ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు సోమవారం నల్లచెరువులోని జిల్లా పరిషత్ పాఠశాల నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు యోగాపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ రవికుమార్‌నాయక్, ఎంఈఓ తిరుపాల్ నాయక్, సర్పంచ్ పంచరత్నమ్మ, వైద్యాధికారులు అలేఖ్య, కల్పన, ఏఓ భారతి, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రఫీ మున్నీసా, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఉపాధి సిబ్బంది, కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నల్లమాడ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వక్తలు సూచించారు. యోగాంధ్రలో భాగంగా సోమవారం నల్లమాడలో ర్యాలీ, మానవహారం నిర్మించి ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ ఆజాద్, మల్లికార్జునరెడ్డి, ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు, సీహెచ్ఓ రామాంజులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర, ఉపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓడీచెరువు : ఓడీసీలో తహసీల్దార్ అనంతాచారి ఆధ్వర్యంలో యోగాపై మాస్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ తుమ్మల పర్వీన్ భాను, భర్త షామీర్ బాషా, సర్పంచ్ గోవిందు, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టీబీపై అవగాహన

తాడిమర్రి: కునుకుంట్ల హెచ్‌డబ్ల్యూసీలో సోమవారం టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా షుగర్ ఉన్నవాళ్లు, అలాగే 60 సంవత్సరాలు పైబడిన వారికి, ఆల్కహాల్, పొగతాగే వారికి, ఎత్తుకు తగ్గ బరువు లేకపోయినవారికి టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ హరిత, పీపీఎం నాగేంద్ర, సిబ్బంది రహమత్‌బాషా, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.